# నేను మాత్రం అమ్మను కాదా?

-మన్నె సత్యనారాయణ

"అమ్మా! రేఖగారూ!"

"ఎవరూ నర్సమ్మా... ఏమిటి ప్రొద్దునే వచ్చావ్?" అంది రేఖ.

"అవసరం వచ్చిందమ్మా. ఓ వెయ్యి రూపాయలు వుంటే ఇవ్వండి. వచ్చే నెలలో ఇచ్చేస్తా. మా ఆయనకు రైతు జీతం కొలుస్తారు. దానిలో రెండుమూడు బస్తాలమ్మేసి మీ డబ్బిచ్చేస్తా" అంది నర్సమ్మ.

రేఖ, నర్సమ్మల పుట్టిన ఊరు ఒకటే. అందువలన ఇద్దరికీ చిన్నతనం నుండి బాగా పరిచయం. నర్సమ్మ పెళ్లి చేసుకుని ఈ ఊరు వచ్చింది. రేఖ ఉద్యోగం నిమిత్తం ఆ వూళ్లో వుంటున్నది. ఆమె ఒక కేంద్ర ప్రభుత్వ ఆఫీసులో సెక్షన్ ఆఫీసర్. భర్త ఒక జాతీయ బ్యాంకులో ఆఫీసర్. నర్సమ్మది కూలీనాలీ చేసుకునే కుటుంబం. ఆమెకెప్పుడైనా డబ్బు అవసరం వస్తే రేఖ ఇస్తుంది. మళ్లీ డబ్బు అందగానే నర్సమ్మ తిరిగి ఇచ్చేస్తుంది.

"బ్యాంకు నుంచి తెప్పిస్తాను. మధ్యాహ్నం రెండు మూడుగంటలకొచ్చి తీసుకెళ్లు" అంది రేఖ.

"వరి చేను ఊడ్పు పనుల్లోకి వెళ్తున్నానమ్మా. మద్దాన్నానికవ్వదు. తెప్పించిబెట్టండి. రేపొద్దున్నే వచ్చి తీసుకెళతాను" అంది.

నర్సమ్మ వెళ్లబోతుంటే రేఖ అడిగింది.

"అవును నర్సమ్మా... నీవు ప్రసవించి ఎన్నాళ్లయింది?"

"నెల దాటిందమ్మా."

"నెలకే పనిలోకెళ్తున్నావు. పనిచేయగలవా? నీరసం రాదా?" కాస్త ఆశ్చర్యంగా అడిగింది రేఖ.

"నీరసంగానే వుందమ్మా. కానీ ఎల్లకపోతే కూలీ డబ్బులురావుగదా. పురిటికి నెల్లాళ్ల ముందునుంచీ పనులోకెల్లడం మానేసాను. పురుడొచ్చాకా నెల్లాళ్లు. మొత్తం రెండునెలల కూలీ. డబ్బులులేవు నాకు. ఇప్పుడైనా ఎల్లకపోతే గడవదమ్మా."

"మరి పిల్లాడ్ని మీ అత్తగారు చూసుకుంటుందా?"

"ఆవిడా పన్లోకెలుతుంది"

"ఆవిడది పెద్ద వయస్సుకదా"

"పెద్దదే. అరవై ఏళ్లు దాటాయి. అందరం పన్లోకి వెళ్లకపోతే ఇల్లు గడవదు కదమ్మా. పిల్లాడ్ని కూడా తీసుకుపోతాను."

'అయ్యో ఇలాంటి వాళ్ల పరిస్థితి ఉంటుందా?' అనుకుంది రేఖ.

"రేకమ్మా... మీరు పెసవించి రెండునెల్లలయ్యింది కదా. మీరాపీసుకు వెళ్లడంలేదా?" అనడిగింది నర్సమ్మ.

"అప్పుడే వెళ్లనక్కర్లేదు. గవర్నమెంటు ఉద్యోగం చేసే స్త్రీలకు ప్రసూతి సెలవులు ఉంటాయి. ఆరునెలలు సెలవిస్తారు."

"అలాగా?" అంది ఆశ్చర్యంగా నర్సమ్మ.

"అంతేకాదు, గవర్నరమెంటు ఉద్యోగం చేసే స్త్రీలకు ఈమధ్య ఓ కొత్త సదుపాయం కలిగించింది ప్రభుత్వం. ఈ పిల్లల్ని పెంచి పెద్ద చేయడానికి, వాళ్లకు 18 సంవత్సరాల వయస్సు వచ్చేలోపు రెండేళ్ల ఆర్జిత సెలవులు వాడుకలోకి వచ్చాయి. దీన్ని అవసరాన్నిబట్టి అప్పుడప్పుడు వాడుకోవచ్చు. గవర్నమెంటు ఉద్యోగం చేసే స్త్రీలకు సదుపాయాలన్నీ ఎందుకు కలగజేస్తున్నారంటే స్త్రీ యొక్క అమ్మతనాన్ని గౌరవించడానికి అని చెబుతున్నారు."

"ఎవరమ్మా అలా చెబుతున్నారు?"

"ప్రభుత్వంలోని నాయకులూ, మా ఉద్యోగ సంఘాల నాయకులూ, మా జీతాలు, సదుపాయాలు పెంచాలని సిఫార్సు చేసే కమిటీ వారూ కలసి ఇలాంటి నిర్ణయాలు చేస్తారు. వారే ఇలా చెబుతున్నారు."

నర్సమ్మ ఆశ్చర్యపోయింది.

"ఎంత అదృష్టవంతులమ్మా మీరు? ఎల్లొస్తానమ్మా పనికి టైమైంది" అని వెళ్లిపోయింది.

★★★

నర్సమ్మ హడావుడిగా ఇంటికెళ్లింది. గబగబా నాలుగు మెతుకులు తింది. పిల్లాడ్ని చంకనేసుకుని ఒక పాత చీరను వేసుకుని పొలానికి వెళ్లింది. అప్పటికే రైతూ, ఇతర కూలీలు ఉన్నారు. ఆ మడి పక్కనే వున్న ఓ చిన్న చెట్టు కొమ్మకు తాను తెచ్చిన పాత చీరను ఉయ్యాలగా కట్టి పిల్లాడ్ని అందులో పడుకోబెట్టింది. తనూ వెళ్లి పనిలో చేరింది. ఓ గంటసేపు పని సాగింది. ఆడవాళ్లు వరి నారు ఊడుస్తున్నారు. ఉయ్యాల్లో పిల్లాడు ఏడుస్తున్నట్లుగా వినిపించింది. "నర్సమ్మా! పిల్లాడు ఏడుస్తున్నాడు. వెళ్లి చూడు" అన్నాడు రైతు.

నర్సమ్మ కంగారుగా వెళ్లి పిల్లాడ్ని లేవదీసింది. ఆ జనానికి వెనుకకు తిరిగి తను కూర్చుని కొంగుచాటు చేసుకుని పిల్లాడికి పాలిచ్చింది. వాడు పాలు త్రాగాక మళ్లీ ఉయ్యాల్లో పడుకోబెట్టింది. వాడు నిద్రపోయాక తను వచ్చి మళ్లీ పనిలో చేరింది. అలాగ సాయంత్రంలోగా నాలుగైదుసార్లు పిల్లాడికి పాలిచ్చింది.

"నర్సమ్మా! మడి పూర్తయ్యేసరికి పొద్దుపోయేలా వుంది. నీవు చంటిపిల్లాడితో ఉన్నావు. ఇంటికెల్లిపో. మిగిలినవాళ్లు చేస్తార్లే" అన్నాడు రైతు. నర్సమ్మ పిల్లాడ్ని తీసుకుని ఇంటికి వచ్చేసింది. పిల్లాడికి పాలిచ్చి మంచంమీద పడుకోబెట్టింది. తను ఇంటి పనులు చేసుకుంది. ఇంతలో అత్తగారు కూడా పనిలోంచి వచ్చింది.

ఆ రోజు రాత్రి భర్త వచ్చాక అందరి భోజనాలు అయ్యాయి. పిల్లాడ్ని పక్కలో వేసుకుని పడుకుంది నర్సమ్మ. ఆమెకు అలసటగా ఉంది.

మనసు కూడా బాగుండలేదు. పురుడు వచ్చే దాకా కనీసం రెండు నెలలైనా పిల్లాడ్ని చూసు కుంటూ ఇంటి దగ్గరుంటే కాస్త ఓపిక తెచ్చుకో వచ్చు. కానీ ఒక్కరోజు పనిలోకి వెళ్లకపోయినా కూలీ డబ్బులు రావు. రాకపోతే ఎలాగ? ఏం బతుకులో తనలాంటి వాళ్లవి? అనుకుంది.

ఆ రోజు ఉదయం రేకమ్మ చెప్పిన మాటలు నర్సమ్మకు గుర్తుకొచ్చాయి. 'మరి నేను కూడా ఓ బిడ్డను కన్నాను కదా. నేనేంటి నాలాంటి ఆడోళ్లంతా బిడ్డల్ని కన్నోళ్లున్నారుకదా. మాకందరికీ ఆ సదుపాయాలక్కర్లేదా? మేం మాత్రం మనసులంకాదా? మాలాంటోల్ల గురించి ఎవ్వరికీ పట్టదు' అనుకుని బాధపడింది.

★★★

ఆ మర్నాడు ఉదయం డబ్బు తీసుకోవడానికి రేఖ ఇంటికి వెళ్లింది నర్సమ్మ. రేఖ డబ్బిచ్చింది.

"వచ్చే నెలలో ఇచ్చేత్తానమ్మా" అంది.


"అలాగే... తొందర్లేదు" అంది రేఖ.

"అమ్మా! ఓమాటడుగుతాను. ఏమీ అనుకోరుకదా" అంది.



"ఎందుకనుకుంటాను. అడుగు" అంది రేఖ.


"నిన్న మీరో మాట చెప్పారు. గవర్నమెంటు ఉద్యోగం చేసే ఆడోరికి పెసవం సమయంలో ఆరునెలలు జీతంతో సెలవిస్తారని. ఆ తరువాత పిల్లల్ని పెంచడానికి రెండేళ్లు సెలవు వాడుకోవచ్చునని చెప్పారుకదా. మరి నేను కూడా ఓ బిడ్డను కన్నానుకదా. నేను మాత్రం అమ్మను కాదా? నాకు మాత్రం ఈ సదుపాయాలక్కర్లేదా? మీరు చెప్పిన అదికార్లూ, పెబుత్వమూ నాలాంటి ఆడోళ్ల 'అమ్మతనాన్ని' గౌరవించనక్కర్లేదా? మేము



## ఒలింపిక్ గోల్డ్?

చైనాలోని వియానింగ్ రాష్ట్రంలో షెన్‌యాంగ్ జూలో ఈమధ్య నేషనల్ హాలిడే వేడుకల సమయంలో పోలీ అనే చిలుక వెయిట్ లిఫ్టింగ్ చేసి సందర్శకుల్ని ఎంతగానో అలరించింది.

-తటవర్తి




కూడా మీతోపాటు ఈ దేశంలో పుట్టి పెరిగినోళ్లమేకదా? మీరు కాగితాల మీద పనిచేత్తుంటే మాలాంటోళ్లమంతా భూమ్మీద పని చేస్తున్నాం" అంది ఆవేదనతో. ఆ ప్రశ్నలు విని రేఖ నివ్వెరపోయింది. ఇలాంటి ప్రశ్నల్ని తానెప్పుడూ ఊహించనుకూడాలేదు. ఒక స్త్రీగా, తల్లిగా, ఈ దేశ పౌరురాలిగా ఆమె న్యాయం అడుగుతోంది.

"ఏమ్మా? నేనేమైనా తప్పుగా అన్నానా?" అంది నర్సమ్మ.

"లేదు నర్సమ్మా! నీవడిగిన ప్రశ్నల్లోని ప్రతి మాటా నిజం" అంది రేఖ.

"అప్పుడే పన్లోకెలతన్నావు, నీరసం రాదా అని అడిగారు మీరు నిన్న. ఆ ఎండలో పని చేత్తావుంటే నీరసంతో ఒక్కోసారి కళ్లు తిరుగుతాయమ్మా. అలాంటప్పుడు కూసేపు గట్టుమీద కూర్చుని మళ్లీ పన్లోకెళతాను. ఇంటికాడ చూసే వోళ్లులేక నిన్న పిల్లాడ్ని నాకూడా పని దగ్గరకు తీసుకెల్లాను. ఓ చెట్టుకొమ్మకు పాతచీర ఉయ్యాల్లా అడ్డి అందులో పడుకోబెట్టాను. వాడేడ్చినప్పుడల్లా ఎల్లి ఆడికి పాలిచ్చి నిద్రబుచ్చి వచ్చి పనిలో చేరేదాన్ని."

"ఇలాంటివన్నీ ఇప్పటిదాకా నాకు తెలియదు నర్సమ్మా. నీలాంటి వాళ్లవి కష్టమైన జీవితాలే. వింటేనే బాధగా అనిపిస్తోంది."

"తెల్సినోరుకదాని నా మనసులోని మాట చెప్పుకున్నాను. ఏమీ అనుకోవద్దు. ఎలతాను. పన్లోకి టైమయ్యింది" అని నర్సమ్మ వెళ్లిపోయింది.

***

"నేను మాత్రం అమ్మను కాదా?" అని నర్సమ్మ వేసిన ప్రశ్నలూ, ఆమె చెప్పిన ఇతర విషయాలూ రేఖ మనస్సులోని ఆలోచనల మూలాల్ని కదిలించి వేసాయి. ఆమెలో కొత్త ఆలోచనలు మొదలయ్యాయి. ప్రభుత్వోద్యోగులకు జీతాలు చాలడంలేదనీ, ధరలు పెరిగాయనీ, జీతభత్యాలు బాగా పెంచాలనీ, సదుపాయాలూ, సెలవులూ పెంచాలనీ ఉద్యోగ సంఘాలు చేసిన ఆందోళనల్లో తానూ పాల్గొంది. తాను కేంద్ర ప్రభుత్వోద్యోగ రాష్ట్ర సంఘానికి ఉపకార్యదర్శి కూడా. ఈ డిమాండ్ల గురించి ఎంతో ఆవేశంతో ఉపన్యాసాలిచ్చింది తను. నినాదాలు చేసింది. ధర్నాలు జరిపించింది. సమ్మెల కాలంలో నాయకత్వం వహించింది.

తాము సమ్మె చేసినప్పుడు ప్రభుత్వ వ్యవస్థలన్నీ స్తంభించిపోతాయి. అందువలన ప్రజలు నానా ఇబ్బందులూ పడతారు. అవేమీ తాము పట్టించుకోరు. ప్రతిపక్షాలు కూడా తమనే సమర్థిస్తాయి. ఎందుకంటే వారికి తమ ఓట్లు కావాలి. చివరకు ప్రభుత్వం దిగివచ్చి తమ డిమాండ్లను అంగీకరిస్తుంది. అందుకు కారణం ఉద్యోగుల మీద జాలి కాదు, ఉద్యోగులైన తామంతా సంఘటితంగా ఉంటారు. తమ డిమాండ్లను అంగీకరించకపోతే తామంతా ఎన్నికల్లో ప్రభుత్వ పార్టీకి వ్యతిరేకంగా ఓట్లేస్తారు. అంగీకరిస్తే అనుకూలంగా వేస్తారు. ఇలా ఓట్ల భయంతోనే అంగీకరిస్తుంది ప్రభుత్వం. ఈ విధంగా తమ జీతాలు, భత్యాలు పెంచుతారు.

అవకాశం వుందికదాని ఐటి ఉద్యోగులూ, తమ చేతిలో పనేకదాని రాజకీయ పదవుల్లో వున్నవాళ్లు, సంఘటిత బలం వుందికదాని ప్రభుత్వ ఉద్యోగులు తమ జీతాలను పెంచుకుంటూపోతే ప్రజల్లో ఆర్థిక అంతరాలు పెరిగిపోతాయి. ఈ విధంగా పెరిగిన వీరి జీతాల అదనపు భారం సంవత్సరానికి కొన్నివేల కోట్ల రూపాయలు ఉంటుంది. తమ కన్నా బాగా తక్కువ ఆదాయం వచ్చే కోట్లాదిమంది సాధారణ ప్రజలు ఈ భారాన్ని మోయాల్సి వస్తుంది. వారు ప్రతిఘటించకుండా మౌనంగా ఈ భారాన్ని భరిస్తున్నారు. ఎందుకంటే వారికి నాయకత్వంలేదు, సంఘటిత బలం లేదు.

గత కాలంలో కూడా ఇంతే జరిగింది. బలవంతుడు బలహీనులకంటే, రాజ్యాధికారమూ, సంఘటిత బలమూకలవారు, అసంఘటిత వర్గాలకంటే సమాజ సంపదలో ఎక్కువ భాగాన్ని పొందగలిగారు. ఆధునిక కాలంలో

ఈ వివక్షతకు ఉద్యోగుల సంక్షేమం మరో వర్గ సంక్షేమం అనే అందమైన పేర్లు పెట్టారు. అయితే ఒకరి సంక్షేమం మరొకరి పీడన కాకూడదనే ఆలోచన ఎవరూ చేయడంలేదు. ఎవరో ఎందుకు తాను కూడా ఇంతవరకూ అలా ఆలోచించలేకపోయింది. ఇప్పుడు మనస్సు పెట్టి ఆలోచిస్తుంటే ఇది ఎంత అన్యాయమో తెలుస్తున్నది. అయితే తానొక్కర్తే ప్రస్తుత వ్యవస్థను మార్చలేదు. ఎవ్వరూ సహకరించరు కూడా. అందువలన తన వ్యక్తిగత పరిధిలో చేయగలిగిందేమిటో చేయడం మంచిది అనుకుంది. ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది. ఫోన్ చేసి రమ్మంటే తల్లి వచ్చింది ఊరు నుంచి. ఆవిడో గవర్నమెంటు డిగ్రీ కాలేజీలో ఉద్యోగి.

"నిన్నెందుకు రమ్మన్నానంటే నేను డ్యూటీలో చేరాలనుకుంటున్నాను. నీవో నెల్లాళ్లపాటు ఇక్కడ ఉండి పిల్లాడ్ని చూసుకో'' అంది రేఖ.

"నేను ఉండడం ఎలా కుదురుతుంది? నా సెలవులన్నీ అయిపోయాయి. ఇప్పుడు నెల్లాళ్లు సెలవంటే జీతం నష్టంమీద పెట్టాలి'' అందావిడ.

"అలాగే... జీతం నష్టంమీదే సెలవు పెట్టు'' అంది రేఖ.

"నీకు మరో రెండునెలలు మెటర్నిటీ లీవుందికదా. నాకు నెలజీతం నష్టం, నీకు రెండు నెలల సెలవు నష్టమూనూ. నీకు మతిగానీ పోయిందా?'' అందావిడ కోపంగా.

"మతి పోలేదమ్మా... జ్ఞానోదయమయింది. నాలాంటి, నీలాంటి కోట్ల మంది తల్లులున్నారీ దేశంలో. వాళ్లందరికీ ప్రసూతి సమయంలో సెలవులు గానీ, జీతాలుగానీ ఇస్తున్నారా? వాళ్లకు కలిగే నష్టం, కష్టం గురించి ఎందుకు ఆలోచించవు? నీవు ఆర్థిక శాస్త్రంలో లెక్చరర్‌వి కదా. ఇటువంటి వాటిని ఆర్థిక కోణంలో, మానవతా దృక్పథంతో ఎందుకు ఆలోచించవు? అయినా నీతో వాదించడానికి రమ్మనలేదు. నా బిడ్డకు అమ్మమ్మగా వాడ్ని చూసి నీ కుటుంబ బాధ్యతను నెరవేర్చు. ఈనెల తరువాత వాడికోసం నేనేదో ఏర్పాటు చేసుకుంటాను'' అనేసి రేఖ ఆఫీసుకు వెళ్లిపోయింది.

ఆఫీసుకువెళ్లి సంబంధిత అధికారిని కలిసి జాయినింగ్ రిపోర్టు ఇచ్చి పనిలో చేరింది.

★★★

ఆ రోజు మధ్యాహ్నం లంచ్‌టైమ్‌లో మహిళా ఉద్యోగులు ఒక చోట కూర్చుని భోజనం చేస్తున్నారు. వాళ్లు కబుర్లు చెప్పుకుంటూండగా ఒకామె అడిగింది.

"రేఖా! లీవు కాన్సిల్ చేసుకుని వచ్చేసావేంటే?''

వాళ్లంతా మహిళలే కనుక మంచిగా అర్థం చేసుకుంటారేమోననే చిన్న ఆశ కలిగింది రేఖకు. అంతకుముందు నర్సమ్మ అడిగిన ప్రశ్నలూ, ఆమె చెప్పిన సమాచారమూ, తరువాత తనకు కలిగిన భావాలూ వాళ్లకు చెప్పింది.

"ఆ... సింగినాదం.. మన లాభనష్టాలేమిటో మనం చూసుకోవాలిగానీ అవన్నీ మనకెందుకు?'' అందావిడ.


"ఔను నిజమే. ఎన్నో పోరాటాలు, సమ్మెలూ చేసి ఈ జీతాల పెరుగుదలా, సదుపాయాలూ సాధించుకున్నాం. వాటిని మనం వినియోగించుకోవాలిగానీ అందరి గొడవా మనకెందుకూ?'' అంది మరొకావిడ.

"ఉద్యోగుల జీతాలు పెంచనక్కర్లేదని నేనడంలేదు. ధరల, అవసరాలు పెరుగుతున్నాయి. అందువలన పెంచాలి. అయితే పెంచే ముందు వేతన సవరణ సంఘం వారు దేశం మొత్తం యొక్క ఆర్థిక స్థోమతను పరిగణలోకి తీసుకోవాలి. ఇతర వర్గాల ప్రజలు ఆదాయ స్థాయిని పరిశీలించి ఉద్యోగుల ఆదాయ స్థాయితో పోల్చి చూలి. ధరలు ఏ స్థాయికి పెరిగాయో చూడాలి. వీటన్నింటినీ అధ్యయనం చేసి అప్పుడు ఉద్యోగుల జీత భత్యాలు ఏ మేరకు పెంచాలో నిర్ణయించాలి. అంతేకానీ మనం చేస్తున్న డిమాండ్లనుబట్టి పెంచకూడదు. అలా పెంచితే ప్రజల్లో ఆర్థిక అంతరం పెరిగిపోతుంది. మొత్తం దేశ ప్రజలందరి మధ్యా సమన్యాయం జరిగేలా ఈ నిర్ణయాలు ఉండాలని నేనంటాను. ప్రసూతి సెలవులు ఇవ్వడం న్యాయమే. అయితే ఇదే సదుపాయాన్ని దేశంలోని మిగిలిన మహిళలకు కూడా కలిగించకపోతే అది న్యాయంకాదుకదా'' అని రేఖ వివరించింది.



## అట్రాక్షన్

'లండన్ డ్రీమ్స్'లో హీరో సల్మాన్‌ఖాన్, హీరోయిన్ అశిన్. ఇందులో హీరో హీరోయిన్‌కి తన ప్రేమను తెలిపే సీన్ ఈ సినిమాకి ఓ అట్రాక్షన్ అవుతుందిట. పారిస్ ఈఫిల్ టవర్ బ్యాగ్రౌండ్‌లో అశిన్ తన కాలును ఇక్కడ వున్న ఫొటోలో కనిపిస్తున్నట్టుగా సల్మాన్ మీద వుంచుతుందిట. అప్పుడు తన ప్రేమ గురించి హీరో చెబుతాడట. సల్మాన్ లాంటి టాప్ హీరో అశిన్ లాంటి కొత్త హీరోయిన్‌తో ఇలా నటించడం గురించి బాలీవుడ్‌లో పెద్ద చర్చనీయాంశమైందిట.



"అవును నిజమే. దేశంలోని మిగిలిన ప్రజలు మనుషులు కారా? వాళ్లు మాత్రం ఈ దేశ పౌరులు కారా? అవకాశాలు అందరికీ సమానంగా ఉండాలి. రేఖగారన్నది కూడా ఆలోచించాల్సిందే" అన్నది మరో ఎఙ్ఞ రాలు.

"ఏమిటి ఆలోచించేది గోంగూర. మనం కష్టపడి పని చేస్తున్నాం, జీతాలు తీసుకుంటున్నాం. సదుపాయాలు పొందుతున్నాం. వాళ్లకి వద్దం టున్నామా? కావాలంటే వాళ్లనూ పోరాటాలు చేయమనండి. మనలా సమ్మెలు చేసి సాధించుకోమనండి. ఎవరు వద్దన్నారు?" అంది మరోకా విడ. ఆ మాటలకు రేఖకు చిర్రెత్తుకొచ్చింది. వివరించి చెప్పినా కూడా వీళ్లు ఆలోచించడానికి కూడా ఇష్టపడడంలేదనుకుంది.

"నిజమే. మనం కష్టపడి పని చేస్తున్నాం. కానీ వాళ్లు కూడా కష్టపడి పని చేస్తున్నారు.మనం నీడన, ఫ్యాన్ల కింద, కొందరు ఏసీ గదుల్లో పని చేస్తు న్నారు. కానీ వాళ్లు వానలో, ఎండలో మట్టిమీద నిలబడి అందరికీ అన్నం పండిస్తున్నారు. ఫ్యాక్టరీల్లో యంత్రాల దగ్గర నిలబడి వస్తువులు ఉత్పత్తి చేస్తున్నారు. నీవన్నట్లు వాళ్లు కూడా మనలాగా సమ్మెలు చేసి రోజుల తర బడి పని మానేసి ఉత్పత్తి ఆపుచేస్తే అందరం తినడానికి ఇప్పుడు నీవన్న గోంగూర కూడా దొరకదు" అంది కోపంగా. రేఖకు కోపమొచ్చిందని వాళ్ల కర్థమైంది. తరువాత ఎవరూ మాట్లాడలేదు.



# టైమ్ రావాలికదా!

హీరోయిన్‌గా డిమాండ్ తగ్గడంతో ఏదైనా వెరైటీగా ట్రయ్ చేద్దాం అనుకున్న ఊర్మిళ 'కర్జ్'లో నెగటివ్ పాత్రని పోషించింది. అలాగే 'ఇఎంఐ' సినిమాలో కామెడీ వేషం చేసింది. ఈ రెండు సినిమాలూ 'ఫట్'మనడంతో డైలమాలో పడింది ఊర్మిళ. ఎలాంటి వేషం వేసినా కలిసి రావడం లేదు, ఇలాగైతే మరి ఏ తరహా పాత్రలు చేయాలీ అని వర్రీ అవుతోందిట ఊర్మిళ. దేన్నికైనా టైమ్ కూడా కలిసి రావాలి కదా!




***

రేఖ ఉద్యోగ సంఘం ఉప కార్యదర్శి పదవికి రాజీనామా చేసింది. రెండురోజుల తరువాత వాళ్ల శాఖ రీజనల్ డైరెక్టర్‌ను కలిసింది. ఆయన ఐఎఎస్ ఆఫీసరు, తెలుగువాడే.

"చెప్పమ్మా ఏమిటి?" అన్నారాయన.

"సార్! నేను రిటైర్ అయ్యాక నాకు పెన్షన్ ఇస్తారుకదా. ఆ పెన్షన్ నేను తీసుకోకుండా ఇద్దరు పేద వృద్ధ మహిళలకు జీవితాంతం ఇచ్చే ఏర్పాట్లు చేయమని ప్రభుత్వాన్ని కోరదలచుకున్నాను. దీనికి మీ గైడెన్స్, సహకా రము కావాలి" అంది.

"అదేమిటి, పెన్షన్ తీసుకోకపోవడమేంటి?" అన్నారాయన ఆశ్చర్యంగా.

"సార్! నేను సెక్షన్ ఆఫీసర్‌ని. నాకు నెలకు పాతికవేలు జీతమొస్తుంది. నా భర్త ఓ బ్యాంకులో ఆఫీసరు. ఆయనకు ముప్పై వేలు వస్తుంది. మా ఇద్దరు జీతం మా కుటుంబ ఖర్చులకు పోగా మిగుల్తుంది. ఓ ఇల్లు కట్టు కున్నాం. రెండు మూడు స్థలాలు కొన్నాం. మేం రిటైర్ అవగానే మా ఇద్దరికీ కూడా వేరువేరుగా పెన్షన్లు ఇస్తారు. అంటే అంతవరకూ కష్టపడి పనిచేసి రిటై రైనవారి కుటుంబానికి రక్షణ కోసం ఇదిస్తారు. మంచిదే. పెన్షన్ అంటే ఫ్యామిలీ పెన్షన్. ఫ్యామిలీ అంటే భార్య భర్త కలిసి ఒక కుటుంబం అవు తుంది. కానీ భర్త ఒక కుటుంబం, భార్య-మరొక కుటుంబం కాదుకదా. మరి ఒక కుటుంబానికి రెండు పెన్షన్‌లు ఇవ్వడమేంటి? మనం తీసుకునే ఈ డబ్బంతా దేశంలో కోట్లాదిమంది సాధారణ ప్రజలదేకదా. వాళ్లంతా జీవిత మంతా ఎంత కష్టపడి పని చేసినా వారి వృద్ధాప్యంలో కూడా వారికి పెన్షన్ ఇవ్వరు. మనకు మాత్రం రెండు పెన్షన్లు. ఇది సమ న్యాయానికి విరుద్ధమని నాకనిపించింది" అంది ఆయనకు వివరిస్తూ.

ఆమె చెప్పినదాంట్లో సామాజిక న్యాయం ఉందనిపించింది.

"కూర్చో అమ్మా... నీవు బాగానే ఆలోచించావు" అన్నారు.

ఆమె కూర్చుంది.

"అంతేకాదు సార్. ఎమ్ఎల్ఏలు, ఎంపీలు, మంత్రులకు పెన్షన్లు ఇస్తు న్నారు. ఎన్నికల్లో కోట్లు ఖర్చు పెట్టగలిగే వారికి పెన్షన్లా?" అంది.

ఆయన నవ్వారు.

"ఇది మరీ అన్యాయం. కానీ మనం ఏమీ చేయలేం"

"అందుకే సార్ నా వ్యక్తిగత పరిధిలో చేయగలిగింది చేయాలనుకుంటు న్నాను"

"అవునంతే. ఇది ఏ ప్రొసీజర్ ప్రకారం చేయాలో తెలుసుగానీ నీకు చెబుతాను. ఒక వారం తరువాత కనిపించు" అన్నారు.

***

ఓ వారం తరువాత మళ్లీ డైరక్టర్‌ను కలిసింది.

"తెల్సుకున్నానమ్మా. ఇంతవరకూ నీలా పెన్షన్ వదులుకున్నవారు లేరు కనుక దీనికో విధి విధానమంటూ లేదు. లీగల్ ఒపీనియన్ తీసుకున్నాం. నీకు రావాల్సిన పెన్షన్‌ను ఇద్దరికి పంచి ఇవ్వాలనుకుంటున్నావుకనుక ప్రభుత్వానికేమీ అభ్యంతరం ఉండదని అన్నారు. వంద రూపాయల స్టాంపు మీద నీవు 'విల్ ఆఫ్ కన్సెంటు' వ్రాసి ప్రభుత్వానికి ఆథరైజేషన్ ఇస్తే నీ రిటైర్‌మెంట్ తరువాత నీవు సూచించిన ఇద్దరు వృద్ధ మహిళలకు నీ పెన్షన్ పంచి ప్రతి నెలా ఇస్తాము. నీవొకసారి చూసి సరేనంటే ఈ స్టాంపు పేపరు మీద టైపు చేయిస్తాను" అన్నారాయన. రేఖ ఆ మేటర్ చదివింది.

"బాగానే వుంది సార్. అలాగే చేయించండి" అంది.

"నీకొక శుభవార్తమ్మా. ఈ విషయం ఎవ్వరికీ చెప్పవద్దన్నావు. అయితే నేను నా భార్యకు మాత్రం చెప్పాను. ఆవిడ కూడా ఐఎఎస్. ఆవిడ నన్ను బాగా మెచ్చుకుంది. అంతేకాదు, ఆవిడ ప్రోద్బలంతో మేమిద్దరం రిటైరయ్యాక ఒక్క పెన్షన్ మాత్రమే తీసుకోవాలని నిర్ణయించుకున్నాం. రెండో పెన్షన్‌ను నీలాగే ఇద్దరు పేద వృద్ధులకిస్తాం."

"చాలా సంతోషం సార్. మీరైనా నన్ను అర్థం చేసుకున్నారు."

"నీవే మాకు స్ఫూర్తి. ఈ విషయం అందరికీ తెలిస్తే మంచిది. తెలిస్తే మంచి మనస్సున్న వాళ్లెవరైనా స్పందించవచ్చు. అంతేకాదు, అందరికీ ఇది తెలిస్తే ఒకే కుటుంబానికి రెండు పెన్షన్ల అనే విధానంలోని డొల్లతనం ప్రజలందరికీ అర్థమవుతుంది" అన్నారు.

"అవును సార్. మీరు చెప్పింది నిజమే,. నా భర్తకు చెప్పిన తరువాత బైటవారికి చెబుతాను" అంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపి రేఖ వచ్చేసింది.

***

ఒకరోజు రేఖ భర్తకు నెమ్మదిగా విషయమంతా చెప్పింది. తన పెన్షన్ వదులుకోవడానికి వ్రాసి ఇచ్చిన విల్ ఆఫ్ కన్సెంట్ గురించి వివరంగా చెప్పింది. భర్త అది విని కోపంతో కేకలేసాడు.

"ఎవరైనా పెన్షన్ వదులుకుంటారా? నీవురిటైరయ్యాక నీ పోషణ ఎలా జరుగుతుందనుకున్నావు?"


"మీకు పెన్షన్ వస్తుంది కదా. మీరు నా భర్త. మీరు నన్ను పోషిస్తారు" అంది శాంతంగా.

"నీ డబ్బు ఊరివాళ్లకు పంచిపెడితే నిన్ను నేను పోషించాలా? నేను పోషించను" అన్నాడు కోపంగా.

"మీరు పోషించకపోతే పోనీలెండి. మన పెళ్లి సమయంలో మావాళ్లు అయిదులక్షలు కట్నమిచ్చారు. అది మీకే ఇచ్చాం. అదేం చేసారని ఒక్కసారి కూడా ఇప్పటివరకూ అడగలేదు నేను. అది స్త్రీ ధనం. అది నాకివ్వండి. ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసుకుంటాను. నేను రిటైరయ్యాక ఎక్కువే అవుతుంది. అదే కాకుండా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌గా నాకు కొంత డబ్బు వస్తుంది. ఈ రెండూ కలిపితే పెద్ద అమౌంట్ అవుతుంది. అది నా పోషణకే కాదు, మనిద్దరి పోషణకు సరిపోతుంది. మీ పెన్షన్ మన కుటుంబానికి ఖర్చు పెట్టనక్కర్లేదు. మీ ఇష్టమొచ్చినట్లు దానిని వాడుకోండి" ఆమెలో కోపంలేదు, ఆమె ముఖంలో చిరునవ్వు తరగలేదు. అతను మాట్లాడలేదు. ఇంతకు మించి ఆమెతో వాదించకూడదనుకున్నాడు. అంతన్నా అంటే అసలు తాను ఉద్యోగమే మానేస్తానని ఆమె అనవచ్చును. తాను ఉద్యోగం మానేస్తే మరో నిరుద్యోగ కుటుంబానికి ఉద్యోగం కలుగుతుందని ఆమె అన్నా కూడా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఆమె ఇప్పుడు ఉద్యోగం మానేస్తే చివరిదాకా ఎంత నష్టమొస్తుందో లెక్క వేసాడు. 'అమ్మో' అనుకున్నాడు. "సరే నీ ఇష్టం" అన్నాడు నెమ్మదిగా. ఆమె ఆ రాత్రి ప్రశాంతంగా నిద్రపోయింది.

ఒక బుద్ధి వికసించింది. వికాసం చెందిన బుద్ధితో నవ్యభావాలు ఉదయిస్తాయి. ఆ నవ్యభావాలు సామాజిక పరివర్తనకు తోడ్పడతాయి. చారిత్రక పరిణామంలో ఇది అప్పుడప్పుడు జరుగుతూ ఉంటుంది. చరిత్ర గతిని ఇది వేగవంతం చేస్తుంది. మానవతా భావం కాలానికి లోబడి ఉండదు. దేశానికి లోబడి ఉండదు. అది నిత్య సత్యం!

★



## సీసాల మందిరం

థాయ్‌లాండ్‌లోని సిసాకిత్ రాష్ట్రంలో సీసాల బౌద్ధ మందిరాన్ని నిర్మించారు. దీని ప్రత్యేకత ఏమిటంటే దీని గోడలు, కాంపౌండే కాదు, పక్కన వున్న విశ్రాంతి గదులు, టాయ్‌లెట్లు, ఆఖరికి క్రిమిటోరియం కూడా సీసాలతోనే నిర్మించారుట. దీని నిర్మాణానికి మొత్తం 10 లక్షల ఖాళీ సీసాలను ఉపయోగించారుట.

-తటవర్తి

